క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి క్షీరాభిషేకం



చింతలచెరువులో క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామ రామాలయంలో శుక్రవారం అధిక శ్రావణ మాసం, బహుళ చతుర్థి, సంకట హర చతుర్థి సందర్భంగా శ్రీభూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు వేద పండితులు శ్రీ కై ప వెంకటనరసింహ శాస్త్రి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, తులసీ అర్చన, విష్ణు పారాయణం, నైవేద్యం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

అత్యవసర చికిత్సలపై శిక్షణ

నంద్యాలటౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో అత్యవసర చికిత్సలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఎలాంటి చికిత్సలు నిర్వహించాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండలన్నారు. ఐఎంఏ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ వసుధారాణి, డాక్టర్లు మధవి, ప్రియదర్శిని, కవిత, శ్రీలక్ష్మి, కల్పన, వైద్యులు పాల్గొన్నారు.

శ్రేష్ఠ పరీక్షల్లో విద్యార్థిని ప్రతిభ

నంద్యాల(అర్బన్): 2023–24 విద్యాసంవత్సరం 8వ తరగతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో అమృత వర్షిణి ఆలిండియా 293వ ర్యాంకు, స్టేట్ ర్యాంకు 24 సాధించిందని చాపిరేవుల మార్నింగ్ స్టార్ పాఠశాలప్రిన్సిపాల్ రూన్సీ జోసెఫ్ శుక్రవారం తెలిపారు. చెప్పారు. విద్యార్థినికి విశాఖపట్నంలోని ఆయేషా వరల్డ్ స్కూల్‌లో అడ్మిషన్ లభించిందని తెలిపారు.

అందుబాటులో ఎరువులు

దొర్నిపాడు: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. శుక్రవారం మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామంలో గ్రామస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. పశువైద్యాధికారి పుల్లయ్య మాట్లాడుతూ పశుకిసాన్ క్రెడిట్ కార్డుతో రుణాలు పొందవచ్చని, అలాగే పశుగ్రాసం కోసం రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

అన్నపూర్ణాదేవికి పరిమళ జలాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలోని అన్నపూర్ణాదేవికి అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం సుగంధ పరిమళ జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి సాయంత్రం దేవాలయ ఆవరణలో భక్తుల ఆధ్వర్యంలో వివిధ రకాల సుగంధ పరిమళ జలాలతో అభిషేకం చేపట్టారు.

యువకుడి అరెస్ట్!

ఆళ్లగడ్డ: పట్టణంలోని సద్దాంకాలనీకి చెందిన ఓ యువకుడు కొన్ని నెలలుగా సామాజిక మాధ్యమాల్లో స్టోరీలు పెడుతూ మహిళలను ఆకట్టుకొని వారి ఫోన్ నంబర్ సేకరించి వారిని వేధిస్తుండేవాడు. అయితే ఓ బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్ చేసి కటకటల్లోకి పంపారు. ఇటీవల సదరు యువకుడికి పట్టణానికి చెందిన వివాహిత పరిచయమైంది. స్నేహంగా మాట్లాడుతనన్నట్లు నటించి మాయమాటలతో ఆమె ఫోన్ నంబర్ సంపాదించాడు. అప్పటి నుంచి నిత్యం ఫోన్‌లో అసభ్యకర మెసేజ్‌లు పెడుతూ, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. బంధువులకు ఫోన్ చేసి ఆమెను చంపుతానని, దాడి చేస్తానని బెదిరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా విచారణ చేపట్టి సద్దాం కాలనీ వాసిగా గుర్తించిఅదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తమ విచారణలో పదుల సంఖ్యలో ఇలాంటి వ్యవహారాలు నడిపినట్లు బయటపడినట్లు సమాచారం.

వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల జీతాలు చెల్లించకుంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్టీయూ నాయకులు ప్రసాదరెడ్డి, హరిప్రియానంద రెడ్డి చెప్పారు. శుక్రవారం బడి వేళలు ముగిసిన తర్వాత సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు జరిమూడు నెలలు అయినప్పటికీ క్యాడర్ స్ట్రెంత్ నమోదు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. అనంతరం వినతి పత్రాన్ని డీఆర్ఓ పుల్లయ్యకు అందజేశారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

నంద్యాల(అర్బన్): దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని ఏపీ ఫైర్ డిపార్టుమెంట్ డైరెక్టర్ జనరల్, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకులు పీవీ సునిల్‌కుమార్ తెలిపారు. దళిత వాడల పర్యటనలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మాల మహానాడు నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఆర్‌టీయూ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకుడిగా వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి దేవనాద శ్రీనివాసులు, హుసేన్‌సాహెబ్ తెలిపారు. నంద్యాల మండల అధ్యక్షుడిగా నాగభాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథయ్య, బండిఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శిగా సబూర్‌బాషా, మహానంది మండల కార్యదర్శిగా బాష్యం రాజశేఖర్, గడివేముల మండల కార్యదర్శిగా బాలస్వామి, వెలుగోడు అధ్యక్షుడిగా మునిరెడ్డి, సంజామల అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, దొర్నిపాడు మండల అధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆరుగాలం కష్టించి పండించిన పంట ప్రకృతి విపత్తు, తెగుళ్ల కారణంగా రైతన్న నష్టపోతే.. తానున్నానంటూ రాష్ట్ర ప్రభుత్వం బీమా అందజేసి భరోసానిస్తోంది. ఎన్నడూలేని విధంగా ఏ సీజన్‌కు ఆసీజన్‌లోనే (పంట నష్ట పరిహారం) ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి అండగా నిలుస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది రబీలో నష్టపోయిన పంటలకు గత నెల 8న ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ. 6.11 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది. అలాగే వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.11.63 కోట్లు చెల్లించింది.

బీమాతో భరోసా

- వైఎస్సార్ పంటల బీమా.. ఇన్‌పుట్ సబ్సిడీతో సాగుదారులకు ధీమా
- ఏటా పంట నష్టపరిహారం చెల్లింపు
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.11.63 కోట్లు చెల్లింపు
- ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6.11 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- నియోజకవర్గంలో ఈ ఏడాది 10,758 మంది రైతులకు లబ్ధి



రుద్రవరంలో కాపు లేని పత్తి పంట (ఫైల్),



చాగలమర్రి సమీపంలో దెబ్బతిన్న ఉల్లి పైరు (ఫైల్)

ఆళ్లగడ్డ: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విత్తు నుంచి విక్రయం వరకు అండగా నిలుస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించడంతో పాటు వైఎస్సార్ ఉచిత పంటల బీమాను వర్తింపజేస్తోంది. గత సంవత్సరం ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులకు వాతావరణంలో వచ్చిన మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడల ఆశించడంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. ప్రభుత్వం నిబంధనల మేరకు వెదర్ బేస్డ్ (వాతావరణ ఆధార బీమా)తో పాటు ఈల్డ్ బేస్డ్ (పంట దిగుబడి అంచనా) ప్రకారం కొన్ని పంటలకు బీమా వర్తింపచేసింది. అలాగే అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టపరిహారం)ని సకాలంలో అందించింది.

రూ.11.63 కోట్లు వైఎస్సార్ ఉచిత పంటల బీమా

2022 ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల్లో వివిధ కారణలో అనుకున్న మేర దిగుబడులు రాని రైతులకు 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' కింద ప్రభుత్వం ఆదుకుంది. నియోజకవర్గంలో 11,812 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా వాతావరణ బీమా కింద 4,413.33 ఎకరాలు, ఈల్డ్ బేస్డ్ కింద 7,398.88 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందుకు సంబంధించి 5,915 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.11,63,20,186 గత నెల 8న వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసింది.

ఈల్డ్ బేస్డ్ కింద ఇలా ...

జిల్లాలో దిగుబడి ఆధారంగా గ్రామ యూనిట్‌గా వరి, మండల యూనిట్‌గా పత్తి, మొక్కజొన్న, కంది, మినుము, ఎండు మిరప పంటలు, జిల్లా యూనిట్‌గా జొన్న, కొర్ర, ఉల్లి పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు ఎంపిక చేశారు.

వాతావరణ బీమా కింద..

వాతవరణ బీమా కింద మండల యూనిట్‌గా వర్షాధారం కింద సాగైన వేరుశనగ, పత్తి పంటలకు బీమా వర్తించనుంది.

ఇన్‌పుట్ సబ్సిడీ రూ. 6.11 కోట్లు చెల్లింపు..

2023 మార్చి 17న అర్ధరాత్రి ఒక్క సారిగా నియోజకవర్గంలో ప్రారంభమైన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. తెల్లారే సరికి 175 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. దీంతో చేతికొచ్చే దశలో ఉన్న మొక్కజొన్న, వరి, మినుము తదితర పంటలకు తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లింది. వెంటనే వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి 4,910 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని నివేదికలు అందజేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం 6,090 మంది రైతుల ఖాతాల్లో రూ.6,11,54,874 ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసింది. నష్టం జరిగిన మూడు నెలల్లోనే పరిహారం అందజేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా లబ్ధిదారులు, దెబ్బతిన్న పంటల విస్తీర్ణం, మంజూరైన సొమ్ము రూ.ల్లో..

	వెదర్ బేస్డ్ బీమా			ఈల్డ్ బేస్డ్ బీమా		
మండలం	రైతులు	దెబ్బతిన్న పంట విస్తీర్ణం ఎకరాల్లో	జమైన నగదు	రైతులు	దెబ్బతిన్న పంట విస్తీర్ణం ఎకరాల్లో	జమైన నగదు
ఆళ్లగడ్డ	506	1,103.31	15,00482	872	885.14	1,91,65,502
చాగలమర్రి	450	1,328.91	1,41,23,101	839	731.83	1,35,86,181
రుద్రవరం	161	280.08	21,95,710	496	410.53	1,33,05,017
శిరివెళ్ల	1	2.96	8,229	789	734.18	1,65,08,380
దొర్నిపాడు	4	5.42	18,648	881	893.19	2,90,28,052
ఉయ్యాలవాడ	652	1,692.65	25,05,103	264	249.63	43,75,781
మొత్తం	1,777	4,413.33	2,03,51,273	4,141	7,398	9,59,68,913

ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టం) వివరాలు..

మండలం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పంటల విస్తీర్ణం హెక్టార్లలో	పరిహారం
ఆళ్లగడ్డ	2243	1737.3	రూ. 2,08,68,135
చాగలమర్రి	1279	1265.19	రూ. 1,70,80,065
శిరివెళ్ల	115	107.038	రూ. 13,38,350
రుద్రవరం	1566	1103.31	రూ. 1,41,84,173
ఉయ్యాలవాడ	886	691.65	రూ. 76,35,651
దొర్నిపాడు	07	6.44	రూ. 48,500
మొత్తం	6,090	4,910.658	రూ. 6,11,54,874

రైతులకు ప్రభుత్వం అండ



గత ఖరీఫ్‌లో 9 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. వాతవరణంలో చేటుచేసుకున్న మార్పులతో పంట ఏపుగా పెరిగినా దిగుబడి అనుకున్నంత రాక నష్టం వచ్చింది. అయితే ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద నుంచి రూ.1,16,861 జమ చేయడం సంతోషంగా ఉంది. గతంలో చేతి నుంచి బీమా ప్రీమియం చెల్లించినా ఎప్పుడూ పరిహారం రాలేదు. ఇప్పుడు మాకు తెలియకుండానే బీమా సొమ్ము ఖాతాలో జమ చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది.ఇంతకంటే మాకు ఇంకేమీ కావాలి.

– షేక్ నూర్‌అహమ్మద్, పత్తి రైతు, చాగరాజువేముల

ప్రభుత్వ సాయాన్ని మరువలేం



గత ఖరీఫ్‌లో 2.78 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో అనుకున్నంత లాభం రాలేదని అనుకుంటూ ఉండగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ.11,509 నగదు నా ఖాతాలో జమ అయ్యిందని మెసేజ్ వచ్చింది. నేను ఒక్క రూపాయి కూడా బీమా ప్రీమియం కట్టలేదు. అయినా ప్రభుత్వమే చెల్లించి పరిహారం మా ఖాతాలో జమ చేయడం సంతోషకరం. అండగా నిలుసున్న ప్రభుత్వ సాయాన్ని ఎప్పటికీ మరువం.

– మహేశ్వర్‌రెడ్డి, ఉల్లి రైతు, పెద్దవంగలి

ఏ సీజన్ పరిహారం ఆ సీజన్‌లోనే..



అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ (పంట నష్టం), వాతవరణంలో వచ్చిన మార్పులు, ఇతర చీడపీడలతో దిగుబడి రాని పంటలకు వైఎఎస్సార్ ఉచిత పంటల బీమా కింద.. దిగుబడి ఆధారిత, వారణ ఆధారిత పంట నష్టపరిహారం ఇస్తున్నాం. పంట కోత ప్రయోగాలను, ప్రామాణికంగా తీసుకుని, వాస్తవ దిగుబడులను పరిశీలించి బీమా మంజూరు చేశాం. ఏ సీజన్ లో పరిహారం సీజన్ ముగిసే సరికే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

– రామ్మోహన్‌రెడ్డి,ఏడీఏ

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు



మాట్లాడుతున్న నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు

చాగలమర్రి: బాల్యవివాహాలు జరిపించినా, ప్రోత్సహించడం చట్టారీత్యా నేరమని, అలాంటి వారికి రూ.లక్ష జరిమానాతో పాటు శిక్ష తప్పదని నంద్యాల ఆర్‌డిఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సమావేశ మందిరంలో ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్యవివాహాల నిరోధక చట్ట అమలుకు చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ మాట్లాడుతూ.. అమ్మాయిలను తల్లిదండ్రులు బాగా చదివించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే విషయాన్ని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు తెలియజేసి, వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్‌డీ సుదర్శనరావు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

గోస్పాడు: ఓటరు జాబితాపై నిర్వహించే ఇంటింటి సర్వేను సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ సూచించారు. శుక్రవారం దీబగుంట్లలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాపై గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారన్నారు. జాబితా సవరణలో పొరపాట్లకు తావివ్వొద్దని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు కోరారు. శుక్వరారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని డీపీఓ మంజుల చెప్పారు.

అధికారుల అవినీతి వల్లే ఇసుక రవాణా

నంద్యాల(న్యూటౌన్): రెవెన్యూ అధికారుల అవినీతి వల్లే కుందూ ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం కుందూనదిని పరిశీలించి మాట్లాడారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

రుద్రవరం: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని మండలంలోని 21 గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రజలకు సూచించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఉయ్యాలవాడ : వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఓఆపీఆర్‌డీ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి, సర్పంచ్ మేకల ఓబులేస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): మండల గ్రామాల్లో డ్రైడే–ఫ్రైడే కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ సిబ్బంది విధిగా పాల్గొనాలని ఎంపీడీఓ సుగుణశ్రీ , ఈఓఆర్‌డీ సూచించారు. శుక్రవారం గ్రామాల్లో చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు.

గోస్పాడు: గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ భాస్కర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

10న డీవార్మింగ్‌డే

శిరివెళ్ల: ఈ నెల 10వ తేదీన మండలంలో డీ వార్మింగ్‌డే పాటిస్తున్నట్లు మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎంపీపీ నాయక్ వసీం ఆవిష్కరించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు డ్రస్ కోడ్ పాటించాలి

ఉయ్యాలవాడ : సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా డ్రస్ కోడ్ పాటించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లె, ఇంజేడు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కొందరు బయటకు వెళ్లడాన్ని గుర్తించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

షద్రక్ ఆశయాలు సాధిస్తాం

నంద్యాల(న్యూటౌన్): ప్రజాసేవకు అంకితమైన షద్రక్ ఆశయాలు సాధిస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. శుక్రవారం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో షద్రక్ మూడవ వర్ధంతి సభ నిర్వహించారు. పుల్లా నరసింహులు, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, తోటమద్దులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పీఎంఎస్‌బీవైని వినియోగించుకోవాలి

ఆళ్లగడ్డ: బ్యాంకు అకౌంట్ ఉన్న ప్రతి ఒక్కరూ పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై బీమా పథకాలను వినియోగించుకోవాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం డైరెక్టర్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ లో శుక్రవారం పీఎంఎస్‌బీవై స్కీం లబ్ధిదారుడు గుర్రం చెన్నయ్యకు బీమాకు సంబంధించి రూ. 2 లక్షల చెక్కు అందజేశారు. వారు మాట్లాడుతూ చింతకుంట గ్రామానికి చెందిన గుర్రం కాంతమ్మ తన బ్యాంకు ఖాతా ఉండటంతో ప్రధానమంత్రి జీవన జ్యోతి కింద ప్రీమియం చెల్లించడంతో మృతి చెందిన వెంటనే బీమా సొమ్ము కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు.

కార్బోఫ్యూరాన్‌తో వరినారులో తెగుళ్ల నివారణ



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను వేయడం ద్వారా వరి నారును కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. రైతులు సాగు చేసిన వరినారులో ప్రస్తుతం కాండం తొలుచు పురుగు, ఉల్లికోడ్ పురుగులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో మొక్కజొన్న, సోయాబిన్, మినుము, వరినారు మడులను వ్యవసాయ విస్తరణ అధికారి మణిమోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఉందని, నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. సోయాబిన్‌ను పచ్చపురుగు, లద్దె పురుగులు ఆశించాయని, నివారణకు అసిఫేట్ 1.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. అంతకు ముందు రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

అందరికీ సంక్షేమం.. అదే జగనన్న లక్ష్యం



వర్షంలోనూ చింతకుంటలో లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిచడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని నంద్యాల, కోవెలకుంట్ల, టీబీ రోడ్లలో, సాయంత్రం చింతకుంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం జోరు వానలోనూ చింతకుంటలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లేవారని, నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరిస్తున్నారని, పాలనలో, పథకాల అందజేతలో తేడాలను గమనించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి, ఇంజేటి నాగిరెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు వరప్రసాద్‌రెడ్డి, నరసింహులు, మహబూబ్‌బాషా తదితరులు ఉన్నారు.

ఎన్‌సీసీ సెలక్షన్స్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని కేఎస్‌ఎం మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఎన్‌సీసీ సెలక్షన్ నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ యూనిట్ మేజర్ వైవీ చైతన్యరెడ్డి, కమాండింగ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో స్టాఫ్ దేవేందర్, రాము, వంశీ ..8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ సెలక్షన్ నిర్వహించి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం రహిమున్నిసా తెలిపారు. సీనియర్ ఎస్ ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. స్టాఫ్ సెక్రటరీ ప్రసాదరెడ్డి, శివకుమార్, రామసుబ్బారెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ రవికుమార్ పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాలటౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 11మంది సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీకి విన్నవించుకోగా తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకట రాముడు, సీసీ నాగరాజు పాల్గొన్నారు.

13లోపు ఓటర్ల సర్వే పూర్తి చేయాలి

చాగలమర్రి: ఈ నెల 13వ తేదీ లోపు ఓటర్ల ఇంటింటి సర్వే పూర్తి చేయాలని నంద్యాల ఆర్‌డీఓ, ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 2,26,104 మంది ఓటర్లు, 295 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. 2024 ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. చాగలమర్రి మండలంలో 17,406 కుటుంబాలున్నాయన్నారు. మండలంలో ఓటర్ల సర్వేను నిర్వహించేందుకు 52 మంది బీఎల్‌ఓలను నియమించామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో పురుష ఓటర్లు ప్రతి 1000 మందికి, మహిళా ఓటర్లు 1,018 ఉన్నారన్నారు. అదే జనాభా లెక్కల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 918 మంది మహిళలున్నారన్నారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు, వివాహమైనా యువతుల పేర్లు తొలగించక పోవడం వల్ల, కొంత మందికి రెండు చోట్ల ఓట్లు నమోదు కావడం వల్ల ఈ తేడా ఉంటుందన్నారు. ఇంటింటి సర్వేలో ఇలాంటి పేర్లను తొలగించటానికి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ఇప్పుడు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లను ఎన్నికల కమిషన్ అక్టోబరు 13న ముద్రించే జాబితాలో చేర్చుతారన్నారు.

నాలుగేళ్లలో 40 సంవత్సరాల అభివృద్ధి



వైఎస్సార్ నగర్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

– ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో పట్టణంలో 40 సంవత్సరాల అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక 38వ వార్డు వైఎస్సార్ నగర్‌లో కౌన్సిలర్ టీ.సావిత్రమ్మ, వార్డు ఇన్‌చార్జ్ టీ.వీ.రమణతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకొని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నాడు అభివృద్ధికి దూరమైన వైఎస్సార్ నగర్ నేడు అభివృద్ధిలో ముందుందన్నారు. గతంలో ఇక్కడ ప్రజలు నివాసం ఉండాలంటే భయపడే వారని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, నాయకులు అంకాలయ్య, బాబురావు, తిరుపతయ్య, జాకీర్ హుసేన్, అన్వర్‌బాషా, రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పుల్లమ్మ, వెంకటస్వామి, ఆచారి, రాము, ఉమాకాంతయ్య, బాబు, చిరు, సోమశేఖర్, శివ, గోరే, ముర్తుజా, చెన్నప్ప పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో వారు ఆరోగ్యవంతులుగా మారతారని జేసీఎస్ జిల్లా కన్వీనర్ సన్నల సాయిరాంరెడ్డి తెలిపారు. పట్టణంలోని గోపాల్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వార్డు కౌన్సిలర్ సన్నల అనూషతో కలిసి గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ చిట్టెమ్మ ఉన్నారు.

రుద్రవరం: ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చిత్రేనిపల్లె సర్పంచ్ గుండా వరలక్ష్మి సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంపూర్ణ పోషణ కిట్లను శుక్రవారం వీఆర్‌ఓ శ్రీనివాసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రావణి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సంపూర్ణ పోషణ మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగులకుంట రోడ్డులో వెలసిన నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో సంకట హర చతుర్థిని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయకుడి మూలవిరాట్‌కు సాయంత్రం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి గరికతో అష్టోత్తర శత నామావళి జరిపించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కాళికాంబకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాసం, మూడవ శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి, ప్రత్యేకంగా ముస్తాబు చేసిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు.